క్లుప్తంగా

నేడు లక్ష తులసి పూజ

తుని రూరల్: ఆషాఢమాసం, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం తలుపులమ్మ అమ్మవారికి లక్ష తులసి పూజ నిర్వహించనున్నట్టు లోవ దేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఈఓ అన్నపూర్ణ

రౌతులపూడి: కాకినాడలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. తొమ్మిదో తరగతి చదువుతున్న కర్రి యశ్వంత్, కర్రి గంగాధర్ ఉత్తమ ప్రతిభ చూపి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరికి డీఈఓ అన్నపూర్ణ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, గాడి కొండబాబు, పాఠశాల హెచ్ఎం కె.రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

చిందేసిన ప్రజాప్రతినిధులు

ఏలేశ్వరం: బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులు మహిళా డ్యాన్సర్లతో కలిసి చిందులేయడం వివాదాస్పదమైంది. వివరాల్లోకి వెళితే..మండలంలోని యర్రవరంలో ఈ నెల 25న ఓ వ్యక్తి జన్మదినాన్ని పురస్కరించుకుని డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. దీనిలో కొందరు ప్రజాప్రతినిధులు అసభ్యకరంగా మహిళలతో కలిసి డ్యాన్స్ చేశారు. కొందరు తమ ఫోన్లలో వీడియోలు తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. గ్రామంలో పెద్దమనుషులుగా ఉన్న కొందరు ప్రజాప్రతినిధులు మహిళలలో కలిసి అసభ్యకరంగా చిందులేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

తీర గ్రామాల ప్రజలకు రక్షిత తాగునీరు



శృంగవృక్షంలో ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించిన దివీస్ ప్రతినిధులు

తొండంగి: తీర గ్రామాల్లో ప్రజలకు దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో రక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నామని దివీస్ కంపెనీ జనరల్ మేనేజర్ వి.నాగేశ్వర్ అన్నారు. దివీస్ కంపెనీ ఆర్థిక సాయం రూ.15 లక్షలతో శృంగవృక్షం, శృంగవృక్షంపేట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్లను బుధవారం సర్పంచ్ అప్పన్నతో కలిసి ఆయన ప్రారంభించారు. తీర గ్రామాల ప్రజలకు మౌలిక వసతుల కల్పనతో పాటు రక్షిత తాగునీరు అందిస్తున్నట్టు నాగేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అడపా సూర్యచక్రం, దివీస్‌కంపెనీ ప్రతినిధులు ప్రాజెక్ట్స్ మేనేజర్ ఎస్.రవికుమార్, హెచ్.ఆర్ మేనేజర్లు ఆర్ సుధాకర్,

రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు రామచంద్రరావు

కోటనందూరు: స్థానిక కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాల అమ్మకాన్ని సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. నాణ్యమైన విత్తనాలను రాయితీపై రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. 1061 రకం విత్తనాలు రూ.1,150, 1064 రకం రూ.1,150, సాంబమసూరి రకం రూ.1,150, ఆర్‌జీఎల్ రూ.1,200 చొప్పున విక్రయిస్తున్నట్టు సొసైటీ సీఈఓ ఎలిశెట్టి వీరభద్రరావు తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు తీసుకొచ్చి విత్తనాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం

ఏలేశ్వరం: సమస్యలు ప్రస్తావనకు రాకుండా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ముగిసింది. స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఆక్రమణ తొలగింపులో అవకతవకలు జరగడంతో వివాదాస్పదంగా మారిందని కౌన్సిలర్ మూది నారాయణస్వామి అన్నారు. ప్రణాళిక ప్రకారం ఆక్రమణలు తొలగిస్తే సమస్యలు వచ్చేవి కావన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. కమిషనర్ కొండలరావు, మేనేజర్ శ్రీనివాసరావు, వైస్‌చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తెల్లబంగారం సాగుకు శ్రీకారం

- మెట్టలో జోరుగా పత్తి నాట్లు
- 13 మండలాల్లో 4095 హెక్టార్లలో సాగు
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీ



ఎస్.అన్నవరంలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతు కూలీలు



చామవరంలో పత్తి నాట్లు వేసిన పొలంలో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్న రైతు

తుని రూరల్: తొలకరి పలకరించడంతో తెల్ల బంగారంగా భావించే పత్తి సాగుకు మెట్ట రైతులు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఒక మోస్తరు వర్షాలు కురవడంతో భూములు పదునెక్కాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పత్తి విత్తనాలు నాటే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కాకినాడ జిల్లాలోని 13 మండలాల్లో రైతులు ఆరుతడి పంటగా పత్తి సాగు చేస్తారు. ఇప్పటికే దుక్కులు చేసిన రైతులు వర్షాలు పడడంతో బీటీ పత్తి విత్తనాలను విత్తుతున్నారు. కాకినాడ జిల్లాలో 4095 (10237.5 ఎకరాలు)హెక్టార్లలో పత్తి సాగవుతుందని అధికారులు అంచన వేశారు.

వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలో..

వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 1951 (4877.5 ఎకరాలు) హెక్టార్లలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. పత్తి సాగుకు నల్లరేగడ, గరువు భూములు, నీటి వసతి లేని భూములు, మెట్ట భూములు అనుకూలంగా ఉంటాయి. ఈ భూముల మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో అధికంగా ఉన్నాయి.

రైతుల్లో పెరిగిన ఆసక్తి

గడిచిన రెండేళ్లు గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉండడంతో ఈ సంవత్సరం పత్తిసాగుపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. గరిష్ఠంగా క్వింటాల్ పత్తికి 2021లో రూ.8 వేలు, 2022లో రూ.8,300 రైతులకు గిటుటబాటు ధర లభించింది. వరంగల్, గుంటూరు వంటి మార్కెట్లలో ఈ ధర రూ.10 వేల వరకూ పలికింది. దీంతో ఈ సంవత్సరం గిట్టుబాటు ధర మరింత లభిస్తుందన్న ఆశలు రైతుల్లో చిగురించాయి. ఫలితంగా అధికారుల అంచనాలకు మించి పత్తి సాగయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే దుక్కులు చేసిన రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. నాట్లు వేసిన రైతులు కలుపు నివారణకు గడ్డి మందులను పిచికారీ చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులుగా హెక్టారుకు రూ.60 వేలు వరకు పెట్టుబడి అవుతుందని రైతులు తెలిపారు.

పత్తిసాగు చేసే మండలాలు, విస్తీర్ణం

మండలం	పత్తిసాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	మండలం	పత్తిసాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
తుని	769	జగ్గంపేట	173
తొండంగి	89	కిర్లంపూడి	34
కోటనందూరు	47	గండేపల్లి	97
ప్రత్తిపాడు	780	పెద్దాపురం	09
ఏలేశ్వరం	29	గొల్లప్రోలు	1018
రౌతులపూడి	765	పిఠాపురం	04
శంఖవరం	281	మొత్తం	4095

బిల్లులు భద్రపర్చాలి

వాతావరణ పరిస్థితులు, అదును పదునూ చూసుకుని పత్తినాట్లు వేయాలి. పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు పంట చేతికి అంది వచ్చే వరకు బిల్లులు భద్రపర్చాలి. పరిమితికి లోబడి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వాడాలి. పెట్టుబడి తగ్గించుకోవాలి. వర్షాకాలంలో ముంపునకు గురికాకుండా రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారి సూచనలు, సలహాలు పాటించాలి.

సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

తాండవ కాలువల్లో పూడిక తొలగించాలి

- ప్రజాప్రతినిధుల డిమాండ్
- కోటనందూరులో మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: తాండవ ప్రధాన పంట కాలువల్లో పూడిక తొలగించాలని, లేనిపక్షంలో ఖరీఫ్‌లో వరి పంట ఎండిపోయే ప్రమాదం ఉందని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. కాలువల్లో పూడిక పేరుకుపోవడం వల్ల నీరు ముందుకు పారడం లేదని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం, బొద్దవరం, ఇందుగపల్లి, బిళ్లనందూరు గ్రామాలకు తాండవ నీరు చేరక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాండవ ఏఈ శ్యామ్‌కుమార్ స్పందిస్తూ కాలువల్లో పూడిక తీతకు సంబంధించి ప్రభుత్వానికి ప్రదిపాదనలు పంపామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే పూడిక తొలగిస్తామని తెలిపారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధిహామీ, పంచాయతీరాజ్, వైఎస్సార్ క్రాంతిపథం, హౌసింగ్, వెటర్నరీ, విద్యుత్, సోషల్ వెల్ఫేర్, ఫారెస్టు, రూరల్ డెవలప్‌మెంట్, రెవెన్యూ శాఖల్లో గత మూడు నెలల్లో జరిగిన అభివృద్ధిపై ఎంపీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడతూ మండలాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి గోవిందు, వేముల రాజబాబు, బొత్స సత్తిబాబు, గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, వేగి అప్పలనాయుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ, తహసీల్దార్ జగదీష్, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి సాధ్యం

- ఎంపీపీ బొప్పన రాము
- తుని మండల సర్వసభ్య సమావేశం



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

తుని రూరల్: క్షేత్రస్థాయిలో అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు సమష్టిగా కృషి చేస్తేనే మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రాము అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను సభ్యులకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాము మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా జూలై 8న మండల పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అన్ని గ్రామాల్లోనూ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. భూముల రీసర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. కౌలు దారుకార్డులతో సాగుదారులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఖరీఫ్ విత్తనాల సరఫరాలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని వి.కొత్తూరు ఎంపీటీసీ సభ్యుడు కిల్లి సన్యాసిరావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఏఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ అన్ని ఆర్‌బీకేల్లో విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ప్రతిపాదనలు పంపించామని, ఎనిమిది ఆర్‌బీకేలకు విత్తనాలు రాలేదన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పి.వెంకటలక్ష్మి, ఎ.మధు, జి.భాగ్యశ్రీలను గౌరవ సభ్యులు సత్కరించారు. ఎస్.సూరవరంలో ప్రజా అవసరాలకు రెండు సెంట్ల భూమిని ఉచితంగా ఇచ్చిన ఎంపీటీసీ సభ్యుడు శెట్టి శ్రీనివాసరావును సభ్యులు ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీడీఓ రవికుమార్ పాల్గొన్నారు.

కొరిపల్లిలో రూ.లక్ష చోరీ

కరప: బంధువుల ఇంటికి పరామర్శకు వెళితే, అల్మరాలో ఉంచిన రూ.లక్ష ఒక దొంగ ఎత్తుకెళ్లిపోయిన ఘటన బుధవారం మండలం కొరిపల్లి జరిగింది. ఎస్ఐ నౌడు రామకృష్ణ తెలిపిన కథనం మేరకు.. కొరిపల్లికి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి కుక్కలూరి నాగేశ్వరరావు అత్త పెదపూడి మండలం అచ్యుతాపురత్రయం గ్రామంలో ఈ నెల 23న మృతి చెందింది. అప్పటి నుంచి ప్రతి రోజూ నాగేశ్వరరావు తన భార్యతో కలసి అచ్యుతాపుర త్రయానికి ఉదయం వెళ్లి సాయంత్రానికి తిరిగి కొరిపల్లికి వచ్చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కూడా వారు అచ్యుతాపురత్రయం వెళ్లారు. కొంతసేపటికి ఎవరో గుర్తుతెలియని వ్యక్తి నాగేశ్వరరావు ఇంట్లో ఉండటాన్ని గమనించి పొరుగున ఉన్న ఎర్రంసీడి రాణి ఫోన్‌చేసి సమాచారం అందించింది. దొంగతనం గురించి సమాచారం తెలిసిన వెంటనే నాగేశ్వరరావు తన మావయ్యతో కలసి ఇంటికివచ్చారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి తప్పుడు తాళంచెవితో ఇంటిలోకి చొరబడి, అల్మరాలో చీరల మాటున ఉంచిన డ్వాక్రా సొమ్ము రూ.లక్ష దోచుకుని పరారైనట్టు గమనించారు. ఈ మేరకు కరప పోలీసుస్టేషన్‌లో బాధితుడు జరిగిన దొంగతనంపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మనప్రభుత్వం



ఏలేశ్వరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం పట్టణంలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి స్థానిక 16వ వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ శిడగం త్రివేణి, పార్టీ పట్టణాధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, దిలబర్ హుస్సేన్, మసిరపు నాగేశ్వరరావు, జువ్విన వీర్రాజు, సిరిపరపు రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



అల్లిపూడిలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న అధికారులు



చినశంకర్లపూడిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుమార్ బాబు

రౌతులపూడి: వచ్చే నెల ఒకటి నుంచి గ్రామాల్లో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.గోవింద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించాలన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలను నిర్దేశించిన తేదీల్లో అందజేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది పారదర్శకంగా పని చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, నానాజీ, సురేష్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై ఇంటింటా సర్వే

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై బుధవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందకపోతే కారణాలు తెలుసుకుని వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జూలై 4న నిర్వహించే సురక్ష శిబిరంలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా జారీ చేస్తామన్నారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏవీ రమణ, జీవీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను పటిష్ఠంగా అమలు చేయాలి

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందించాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సర్వే చేయాలి

ప్రత్తిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు ఆదేశించారు. ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా..? లేదా ? అని ఆరా తీశారు. గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్న), పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, కస్తూరి తేజాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగనన్న సురక్ష సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరావు ఆదేశించారు. గెద్దనాపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. జగనన్న సురక్ష సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో బుధవారం మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా అధ్యక్షతన వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల జగనన్న సురక్షపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఒకటి నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అవసరమైన వారికి కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని సూచించారు. జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



సీతంపేట రిఫరల్ ఆసుపత్రిలో దివ్యాంగురాలికి కృత్రిమ అవయవం అమర్చుతున్న వైద్య సిబ్బంది

శంఖవరం: మండలంలోని సీతంపేట రిఫరల్ ఆసుపత్రిలో దివ్యాంగులకు బుధవారం ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిఫరల్ ఆసుపత్రి చైర్మన్ స్లైషర్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ఆసుపత్రిలో కృతిమ అవయవాల విభాగం ఏర్పాటు చేశామన్నారు. నాణ్యమైన ముడిసరకుతో కృత్రిమ అవయవాలు తయారుచేసి దివ్యాంగులకు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం అన్నవరం, కత్తిపూడి, రాజానగరం, జగ్గంపేట, రాజమహేంద్రవరం నుంచి వచ్చిన దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్, సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని గ్రామాల్లో దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాతో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ బుధవారం తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ దాడులు చేశామన్నారు. ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో వెదురుపాక ఏసుబాబు, బవురువాకలో గుర్తిత్తు కన్నమ్మ, ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లిలో కట్టు కుమారి, దళాల కుమారిలను అరెస్టు చేసి, ఒక్కొక్కరి నుంచి ఐదేసి లీటర్ల చొప్పున సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరు పరచి, రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

కిర్లంపూడి: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకంలో పని కల్పించాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు అధిక పని దినాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ పరిధిలో తమకు అప్పగించిన టార్గెట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ నాగమణి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయ ఏఓగా శ్రీనివాసరావు



ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి (ఏఓ)గా జె.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఏఓగా పనిచేసిన కె.సత్యనారాయణ పదోన్నతిపై ఎంపీడీఓగా కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథం, ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు తదితరులు ఏఓ శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



ఏలేశ్వరంలో టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఏలేశ్వరం: పట్టణంలోని టీబీ రోగులకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ రోగులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సౌమ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు పది మంది టీబీ రోగులను దత్తత తీసుకొని ఆరు నెలలు పాటు పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలు టీబీ రోగులను దత్తత తీసుకొని పౌష్టికాహారం అందించాలని కోరారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గా వెంకటప్రసాద్, జ్యోతుల శ్రీనివాస్, అనసూరి నాగేశ్వరరావు, కోట శ్రీనివాసచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: బైక్ చోరీ కేసులో వ్యక్తికి 7 నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ స్పెషల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎ.నాగమల్లేశ్వరి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఆకివీడు మండలం చిన కాపవరానికి చెందిన కుప్పల ఏసు అలియాస్ రమేష్ 2022లో నడకుదురు గ్రామంలో హోటల్ వద్ద ఉన్న బైక్‌ను చోరీ చేశారు. దీంతో కరప పోలీసులకు బైక్ యజమాని వీరభద్రరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో రమేష్ నేరం అంగీకరించడంతో 7 నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.